క్లుప్తంగా

శ్రీలక్ష్మణ స్వామికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలను అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: శ్రీకోదండరామాలయానికి అనుబంధంగా వెలసిన శ్రీలక్ష్మణ స్వామివారికి భక్తులు వెండి ఆభరణాలను ఆదివారం అందజేశారు. స్థానిక కొత్తపేటకు చెందిన నాదమునిరెడ్డి, సుశీలమ్మ దంపతులు సుమారు 571 గ్రాముల బరువు గల కిరీటం, హస్తాలను ఆలయ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రం ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కీలకమైన దుర్యోధన వధ ఘట్టం నిర్వహించారు. నీటిలో దాక్కున్న దుర్యోధనుడిని బయటకు రప్పించి భీముడు చంపే ఘట్టాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మునిరెడ్డి, నాదమునిరెడ్డి, కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొబ్బినాయనపల్లెలో..

పాకాల: మండలంలోని మొబ్బినాయనపల్లి గ్రామంలో మహాభారతంలోని ఆఖరి ఘట్టం దుర్యోధన వధ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీముడు, దుర్యోధన పాత్రలలో ఉన్న కళాకారులు ఆలపించిన పద్యాలు అలరించాయి. రాత్రి 7 గంటలకు తమ కోరికలు నెరవేరాలని ప్రజలు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ధర్మరాజుల పట్టాభిషేకం నిర్వహించారు.

నేడు గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు.

కళలను భావితరాలకు అందిద్దాం

తిరుపతి కల్చరల్ : భారతీయ కళాసంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ జానపద నృత్య పోటీలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. కస్తూర్బా కేంద్ర ట్రస్టు చైర్మన్ డాక్టర్ పి సి రాయులు, రిటైర్డ్ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం వేణుగోపాల్ రెడ్డి, వూకా విజయ్ కుమార్, ఆకుల సతీష్ కుమార్, కొత్తపల్లి మునిరత్నం, వైఎస్ బాబు, కాపు సంఘం నేత కష్టయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

అమ్మో.. సుబ్రమణ్యమా!



గాదంకి సమీపంలో ప్రభుత్వ కుంట పోరంబోకును ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడ

- ఎమ్మెల్యే నాని అండతో యథేచ్ఛగా భూ దందాలు
- కోట్ల విలువైన ప్రభుత్వ భూముల దురాక్రమణ
- రెవెన్యూ సహకారంతో రికార్డులు తారుమారు
- రిజిస్ట్రేషన్ అధికారుల అండతో వేరొకరికి విక్రయాలు
- గాదంకి టోల్ ప్లాజా వద్ద ఆక్రమిత భూముల్లో దుకాణాలు
- ప్రభుత్వ భూముల విక్రయంతో కోట్ల రూపాయల సంపాదన
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి బినామీ అంటూ విమర్శలు

- చంద్రగిరి మండలం పాకాలవారిపల్లి సమీపంలోని గాదంకి టోల్‌ప్లాజా వద్ద పనపాకం లెక్క దాఖలా సర్వే నంబరు 880బి/డిలో కాలువ పోరంబోకు, 882/2లోని జాతీయ రహదారి భూమిని దర్జాగా ఆక్రమించుకున్నాడు. ఆ విషయం బయటకు రాకుండా దానికి ఆనుకుని ఉన్న పట్టా భూమిని కొనుగోలు చేసి ఆక్రమిత భూమిలో శాశ్వత దుకాణాలు నిర్మించాడు. తన వెంట తిరిగే అనుచరులకు వ్యాపారాలు సాగించుకునేందుకు అద్దెకు ఇచ్చారు. దుకాణాలను తొలగించి ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి అనేక మార్లు జాతీయ రహదారి అధికారులు ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యే నాని అడ్డుపడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆయన ఒక అధికార పార్టీ ఎమ్మెల్యేకి ప్రధాన అనుచరుడు.. కాదు.. కాదు.. సమీప బంధువుగా చెప్పుకుంటున్న నాయకుడు.. తెల్ల చొక్కా.. చేతికి బంగారం గొలుసు.. ఖరీదైన కారులో తిరుగుతూ.. సమాజంలో పెద్ద మనిషిగా చెలామణి అవుతున్న భూ బకాసురుడు.. ప్రభుత్వ భూములను కాజేసే కబ్జాకోరు.. ఎమ్మెల్యే అండతో రెవెన్యూ అధికారులను గుప్పిట్లోకి తెచ్చుకుని రికార్డులను తారుమారు చేయగల గొప్ప నేర్పరి.. రిజిస్ట్రేషన్ అధికారుల సహాయంతో వేరొకరికి విక్రయించి కోట్లు సంపాదించుకునే ఘనుడు.. ఆయన ఎవరో కాదు.. చంద్రగిరి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు. ప్రభుత్వ భూములు ఎక్కడ కనబడ్డా.. వెంటనే తన వశం చేసుకోవడం ఆయనకున్న అలవాటు.. అధికారం రాగానే కోట్ల రూపాయల సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నానికి బినామీ అన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఒక్క చంద్రగిరి మండలమే కాదు.. పాకాల, తిరుపతి రూరల్ మండలాల్లో కూడా వారి భూ దందాలు వెలుగులోకి వస్తుండటంతో అమ్మో.. సుబ్రమణ్యమా.. అంటూ సొంత పార్టీ నేతలే నోరెళ్లబెడుతున్నారు. కాలువలు, కుంటలు, నదులు, గ్రామ కంఠాలు, దరఖాస్తు పట్టా భూములు ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. ప్రభుత్వ భూమి ఏదైనా సరే తన ఆధీనంలోకి తెచ్చుకోవడం, ఆపై క్రయ, విక్రయాలు చేసేయడం ఆయన నైజం. భూ ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులే వారికి సహకరిస్తుడడంతో 'పల్లినేని' భూ దందాలకు అడ్డులేకుండా పోతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భూ దందాలకు తెర లేపారు. తిరుపతి రూరల్ మండలంలోని హథీరాంజీ మఠం భూములపై కన్నేసి, ఆ మఠం సిబ్బందిని నిర్బంధించి మరీ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఆయన ప్రధాన అనుచరుడైన పల్లినేని సుబ్రమణ్యం నాయుడు కూడా అదే బాటలో ముందుకు సాగుతున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులను భయపెట్టి ప్రభుత్వ భూములను కాజేస్తూ రికార్డులను తారుమారు చేసి క్రయ, విక్రయాలు సాగించి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా ఏ అధికారికైనా సుబ్రమణ్యం నాయుడు ఏమి చెబితే అది చేయాల్సిందేనన్న సంకేతాలు బలంగా ఇవ్వడంతో ఆయన భూ దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. గత కొంత కాలంగా చంద్రగిరి, పాకాల మండలాల పరిధిలో సుబ్రమణ్యం నాయుడు చేసిన భూ కబ్జాలపై స్థానికులు జిల్లా అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవడంతో ఆయా మండలాల రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.



గాదంకి టోల్ ప్లాజా సమీపంలోని కాలువ పోరంబోకులో అక్రమంగా నిర్మించిన దుకాణం

- పనపాకం లెక్కదాఖలు సర్వే నంబరు 31/1లో సుమారు 8.98 ఎకరాల విస్తీర్ణంలో స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఆ నదికి ఆనుకుని ఆ నాయకుడి మామిడితోట ఉండడంతో అక్కడ కూడా తన అధికార బలాన్ని ప్రయోగించాడు. ఇంకేముంది అక్కడ మరో 2 ఎకరాలకు పైగా నది పోరంబోకు భూమిని తన తోటలోకి కలుపుకుని ఏకంగా ఫెన్సింగ్ వేసేసుకున్నాడు.
- ఇదంతా ఒక ఎత్తు అయితే, పాకాలవారిపల్లెలోని కుటుంబానికి సంబంధించిన భూమిని సైతం అక్రమ మార్గంలో తనపై రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ కుటుంబానికి క్షోభను గురిచేశారు. దీనిపై బాధితులు గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో తహసీల్దారుగా వచ్చిన వారిపై టీడీపీ అధికారంలోకి రాగానే ఆ భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి తెచ్చింది. దానికి ఆయన ససేమిరా అనడంతో, ప్రస్తుతం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన వారి ద్వారా వాటిని ఆ పని పూర్తి చేసుకోవాలనే ప్రయత్నాలు గట్టిగానే సాగుతున్నట్లుగా బాధితులు చెబుతున్నారు. ఇదే వ్యవహారంలో ఆయనతో పాటు మరికొంత మంది టీడీపీ నేతలు, రెవెన్యూ అధికారులపై బాధితులు కోర్టులో ప్రైవేటు కేసు కూడా వేసినట్లు సమాచారం. దీంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి టీడీపీకి సహకరించిన అధికారుల్లో గుబులు పట్టుకుంది.

- పాకాల మండలం గాదంకి లెక్కదాఖల సర్వే నంబరు 7/4/1లో సుమారు 70 సెంట్ల కుంట పోరంబోకు భూమి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. దీనిపై కన్నేసిన పల్లినేని సుబ్రమణ్యం నాయుడు దాని వెనుకనే వున్న పట్టా భూమిని కొనుగోలు చేశాడు. పట్టా భూమితో పాటు రోడ్డుకు ఆనుకుని కాలువ పోరంబోకు భూమిని ఆక్రమించేసి తన భూమిలో కలిపేసుకున్నాడు. ఆ తర్వాత పాకాల రెవెన్యూ అధికారుల సహకారంతో ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగింపచేసి, దర్జాగా మరొకరికి విక్రయించేసి సొమ్ము చేసుకున్నాడు. అక్కడ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఒక ఎకరా భూమి రూ.7 కోట్లు ఉండడతో స్థానికులు ఆ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ సూచించారు. ఏపీఎస్ఎస్‌డీసీ, నాంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు ఐదురోజుల పాటు జరిగిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉపాధి, ఉద్యోగాలే లక్ష్యంగా విద్యార్థినులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే కమ్యూనికేషన్ స్కిల్, వృత్తిపరమైన శిక్షణ తప్పనిసరన్నారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన సంస్థలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ శ్రీలక్ష్మి, కేపీ పద్మజ, టి శ్రీనాథ్, నాంది ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లంగుంటలో పోలీసుల కార్డన్ సెర్చ్

తిరుపతి రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఆదివారం తెల్లవారుజామున మల్లంగుంట పంచాయతీ పరిధిలో తిరుపతి రూరల్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం పంచాయతీ పరిధిలోని గరుడాద్రి, వెంకటాద్రి అర్బన్ హౌసింగ్ సముదాయంలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. ఆధార్ కార్డులను చెక్ చేశారు. ఎప్పటి నుంచి నివాసం ఉంటున్నారు. ఏం పనిచేస్తారు...అంటూ ఆరా తీశారు. రౌడీషీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచారు. సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి రికార్డులు చూపని జీపు, కార్లు-3, ఆటోలు-4, మోటార్ సైకిళ్లు-40 మొత్తం 48 వాహనాలను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేంది లేదని, రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు మారి జనజీవనంలోకి రావాలని సూచించారు.



పోలీసులు సీజ్ చేసిన రికార్డుల్లేని వాహనాలు

ఆర్టీసీ కార్గోకు ఆదరణ

- వినూత్న మార్పులతో రాబడి దిశగా అడుగులు
- క్రమంగా పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య
- గత ప్రభుత్వంలో అమలుచేసిన సంస్కరణల ఫలితం



తిరుపతి బస్టాండ్‌లోని కార్గో సెంటర్

తిరుపతి అర్బన్: ఆర్టీసీ అభివృద్ధికి గత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఎన్నో ఉన్నాయి. వినూత్న రీతిలో పలు మార్పులు చేపట్టడంతో ఆర్టీసీ కార్గో రాబడి దిశగా పయనిస్తోంది. ప్రధానంగా పారదర్శక సేవలు అందించడంతోపాటు ఏజెంట్లకు కమీషన్ పెంపు, చిల్లర సమస్యలకు చెక్ పెట్టడానికి డిజిటల్ పేమెంట్స్ సౌకర్యం, బుకింగ్ సమయంలో చార్జీల చెల్లింపు లేదా తీసుకునే సమయంలో చెల్లింపులు, డోర్ డెలివరీ వసతులు, భద్రంగా బాధ్యతగా వస్తువులను చేర్చడం తదితర మార్పులు చేపట్టడంతో ఆర్టీసీ కార్గోపై కస్టమర్లకు నమ్మకాన్ని పెంచారు. దీంతో రాబడిలో దూసుకుపోతుంది.

15 శాతం కమీషన్

ఆర్టీసీ కార్గోకు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల్లో కార్గో సెంటర్లు నడుస్తున్నాయి. అంతేకాకుండా మరో 27 మంది ఏజెంట్లు పనిచేస్తున్నారు. వారికి వ్యాపారంలో 15 శాతం కమీషన్ అందిస్తారు. గత ప్రభుత్వంలో కార్గో అభివృద్ధికి ప్రత్యేక బాటలు వేశారు. దీంతోనే కస్టమర్ల సంఖ్య పెరుగుతుంది. రోజుకు 2019లో 200 పార్శిళ్లు మాత్రమే బుకింగ్ అయ్యేవి. 2024కు 1000 మేరకు పార్శిల్స్ జిల్లా వ్యాప్తంగా బుకింగ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో కార్గో అభివృద్ధికి కృషి

ప్రధానంగా డోర్ డెలివరీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. పలు ప్రైవేటు కార్గో సెంటర్లు నడుస్తున్నప్పటికీ వారు డోర్ డెలివరీ ఇవ్వడం లేదు. కేవలం ఆర్టీసీ కార్గో మాత్రమే ఇంటికే వస్తువులను అందిస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో ప్రైవేటు కార్గో ధరలతో పోల్చుకుంటే 30 నుంచి 40శాతం ఆర్టీసీ కార్గో రేట్లు తక్కువగా వసూలు చేశారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్టాండ్లలో వినియోగదారులు గంటలకొద్దీ క్యూలో ఉండకుండా కౌంటర్లు పెంచారు. ఉదాహరణకు తిరుపతిలో గతంలో రెండు కౌంటర్లు ఉండేవి. గత ఏడాది మరో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు చేతికి డబ్బులు ఇవ్వడం ద్వారా కార్గో నిర్వాహకులు చిల్లర సక్రమంగా ఇవ్వడం లేదని డిజిటల్ పేమెంట్స్ సౌకర్యాన్ని కల్పించారు. యూపీఐ పేమెంట్ చేయడానికి స్కానర్లతోపాటు ఫోన్‌పే, గూగుల్ పే సౌకర్యాలను కల్పించారు. అంతేకాకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో పార్శిల్ బుకింగ్ చేసే వ్యక్తి డబ్బులు చెల్లించుకున్నా, తీసుకునే వ్యక్తి డబ్బులు చెల్లించే పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇలా పలు మార్పులు చేపట్టడంతో ఆర్టీసీ కార్గో విజయవంతంగా ముందుకు సాగుతోంది.

కార్గో ఆదాయం ఇలా...

- 2019లో జిల్లా కార్గో ఆదాయం రూ.20వేల నుంచి రూ.50వేలు
- 2020లో రోజు వారీ ఆదాయం రూ.50 వేల నుంచి రూ.1.25 లక్షలు
- 2021లో రూ.1.25 లక్షల నుంచి రూ.1.75 లక్షలు
- 2022లో రూ.1.75 లక్షల నుంచి రూ.2.75 లక్షలు
- 2023లో 2.27 లక్షల నుంచి 3.10లక్షలు
- 2024లో 3.10 లక్షల నుంచి రూ.4 లక్షలు.
- 2025లో రూ.4లక్షల నుంచి రూ.6లక్షలు చేయాలని ఆర్టీసీ అధికారులు టార్గెట్.

దొంగల సంత

- ప్రతి శనివారం వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీ
- పోలీసుల నిఘా ఉన్నా చోరీలు
- లబోదిబోమంటున్న బాధితులు



రేణిగుంట వారపు సంత

రేణిగుంట: రేణిగుంట వారపు సంత..ఎండు చేపలకు ప్రసిద్ధిగాంచిన ఈ సంతలో ఇటీవల దొంగల బెడద ఎక్కువగా ఉంది. జేబులో ఉన్న సెల్‌ఫోన్లు ఎలాంటి స్పర్శ లేకుండా చాకచక్యంగా కొట్టేస్తున్నారు. ప్రతివారం సంతకు వచ్చిన వారి నుంచి కాస్త ఏమరుపాటుగా ఉంటే సెల్‌ఫోన్లు మాయం చేస్తున్నారు. ఓ వైపు పోలీసులు సంతలో తిరుగుతున్నా.. వారి కళ్లుగప్పి వరుస చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో క్షణాల్లో తేరుకున్నా, దొంగలించిన ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో చేసేది లేక బాధితులు నిర్వేదంతో తలలు పట్టుకుంటున్నారు.

రేణిగుంట సినిమా వీధి సమీపంలో ప్రతి శనివారం వారపు సంత పెద్ద ఎత్తున జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలు, జిల్లాలు, తమిళనాడు రాష్ట్రం నుంచి కూడా ఈ సంతకు కూరగాయలు, ఎండు చేపలు కొనుగోలు చేసేందుకు ప్రతివారం అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రధానంగా సాయంత్రం జనంతో సంత ప్రాంగణమంతా కిక్కిరిసి పోతుంది. పక్కకు తొలగడానికి కూడా సందు దొరకని రద్దీ ఉంటుంది. అయితే సంతలో దొంగల ముఠా తిష్ట వేసి ప్రధానంగా మొబైల్ ఫోన్లను దొంగలిస్తున్నారు. సంతకు వచ్చే వారిలో కాస్త అమాయకంగా కనిపించినా, మొబైల్ ఫోన్ పైజేబులో పెట్టుకున్న వారిని ఈ ముఠా గుర్తించి వారి నుంచి సెల్‌ఫోన్ కొట్టేసేందుకు పథకాన్ని రచిస్తారు. అందరూ కలసి సంచులు చేతపట్టుకుని ఎలాంటి అనుమానం రాకుండా కూరగాయలు కొంటున్నట్లు వెంబడిస్తారు. ఓ పక్క కూరగాయలు కొనుగోలు చేస్తుంటే వీరు తోపులాటను సృష్టించి ఎలాంటి స్పర్శ తెలియనివ్వకుండా క్షణాల్లో జేబుల్లో నుంచి మొబైల్ ఫోన్లు కొట్టేస్తారు. బాధితులు తేరుకుని వేరొకరి ఫోన్ నుంచి డయల్ చేసినా అప్పటికే స్విచ్ ఆఫ్ చేసి మొబైల్‌లను మాయం చేస్తారు. ఉదయం నుంచి పోలీసు సిబ్బంది సంతలో నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నా, వారి కళ్లు గప్పి దొంగతనాలను మాత్రం ప్రతి వారం యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఎంతో మంది బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రికవరీ లేకపోవడంతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువ మంది ఫిర్యాదు చేయకుండానే నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు. ఓ ముఠానే పక్కా ప్రణాళికతో ప్రతి వారం సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసు అధికారులు సంతలో సెల్‌ఫోన్ల దొంగతనాలను కట్టడికి చర్యలు చేపట్టాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

క్షణాల్లో మాయం

నేను రేణిగుంట వారపు సంతకు కూరగాయలు కొనుక్కునేందుకు వెళ్లి రూ.40వేల విలువైన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాను. నేను కూరగాయలు తీసుకుంటుండగా నా జేబులో ఉన్న సెల్‌ఫోన్ రెప్పపాటులో మాయమైంది. పోలీసు సిబ్బంది అక్కడే ఉన్నారు. పక్క వారి నుంచి ఫోన్ తీసుకుని నా ఫోన్‌కు రింగ్ చేశాను. అప్పటికే స్విచ్ ఆఫ్ చేసేశారు. ప్రతివారం దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసు అధికారులు చర్యలు తీసుకుని దొంగల ముఠాను పట్టుకుని ఫోన్లు రికవరీ చేయాలి. – ఉమేష్, రేణిగుంట

సంత రోజున పోలీసు నిఘా

సంతలో ట్రాఫిక్ నియంత్రణకు, దొంగల కట్టడికి ప్రతి శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. అయినా తరచూ మొబైల్ ఫోన్ల దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పటిష్ట నిఘాను పెంచడంతో పాటు సాంకేతిక సహకారాన్ని తీసుకుని దొంగల ముఠాను పట్టుకుంటాం.

– సునీల్‌కుమార్, ఎస్‌ఐ, గాజులమండ్యం, రేణిగుంట మండలం

రెండు నెలలుగా అందని వేతనాలు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపకులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు లేకుండా నరకయాతన అనుభవిస్తున్నా, వర్సిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో దాదాపు 54 విభాగాల్లో సుమారు 240 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, 40 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. జూన్, జూలై నెలలకు సంబంధించి జీతాలు ఇంతవరకు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని ఆవేదన చెందుతున్నారు. కోర్టు ఉత్తర్వులతో జూన్ 24న విధుల్లో చేరిన అధ్యాపకులకు మాత్రం వేతనాలు సమయానికి చెల్లించారని, గత కొన్ని ఏళ్లుగా బోధన, పరీక్షల నిర్వహణలో తాము ప్రధాన పాత్ర వహిస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పక్షపాత వైఖరిని విడనాడి తమకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎటువంటి సమాచారం, నోటిఫికేషన్ విడుదల చేయకుండా మరో ఇద్దరు తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి వర్సిటీ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కార్మికుల ఆకలి కేకలు

తిరుపతి తుడా: పారిశుద్ధ్య కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదు. రోజులు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, ఆపరేటర్లు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆర్థిక అవస్థలు తప్పడం లేదు. మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని విభాగాల్లో మొత్తం 1500 మందికి పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో పారిశుద్ధ్య కార్మికులు 800 మంది, డ్రైవర్లు 250 మంది, అలానే కంప్యూటర్ ఆపరేటర్లు, తెలుగంగ వర్కర్స్, అటెండర్లు, యూడీఎస్ వర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ గతంలో మార్చి మినహా ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించేవారు. అయితే ప్రస్తుతం 11 రోజులు అవుతున్నా ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేకపోయారు. దీంతో కార్మికులు, డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలపై ఆధారపడే తమకు ఇలా రోజుల తరబడి వేతనాలను చెల్లించకుంటే కుటుంబాన్ని ఎలా పోషించాలంటూ మండిపడుతున్నారు. వేతనాలు నాలుగు నెలలకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ ఖాతా నుంచి ప్రభుత్వం చాలా రోజుల క్రితమే డివిడెంట్‌గా కట్ చేసుకుంది. అయితే ఇప్పటివరకు చెల్లించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.


తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట పై వెలసిన శ్రీతిరుపతి గంగమ్మకు శ్రావణ ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున అభిషేకం, అర్చనలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు అంబలి పంపిణీ చేశారు.



విశేషాలంకరణలో అమ్మవారు

ఘనంగా పరుష పందాలు



పరుష పందాల్లో ఎద్దులను నిలువరిస్తున్న యువత

పాకాల: మండలంలోని కావలివారిపల్లిలో పరుష పందాలను ఆదివారం స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పరుష పందాలలో స్థానిక యువత రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఎద్దులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ఎద్దులను సుందరంగా అలంకరించారు. వాటి కొమ్ములకు రకరకాల రంగులద్ది, తమకు ఇష్టమైన నటులు, నాయకుల ఫొటోలతో ఉన్న పలకలను వాటి కొమ్ములకు కట్టి ఊరంతా పరుగులెత్తించారు. అనంతరం రంగంలోకి దిగిన పెద్దపెద్ద ఎద్దులను నిలువరించేందుకు, ఎద్దుల కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించుకునేందుకు యువత పోటీపడ్డారు. స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరుష పందాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.